క్లుప్తంగా

11న అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఈ నెల 11న ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరపనున్నట్లు కార్యనిర్వాహణాధికారి దీవి వేంకటప్పలాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక సుమంగళి పూజ జరుగుతుందని పేర్కొన్నారు. రాత్రి స్వామి వార్లకు శాంతి కల్యాణం, విశేష పూజలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా అనంతభోగేశ్వరుడికి లక్ష బిళ్వార్చన



కొల్లూరు: అనంతభోగేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్తిక మాసంలో నిర్వహించే పూజలలో భాగంగా పార్వతీ అమ్మవారి ఆలయ దేవస్థాన బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి తొలుత ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం, మంత్రోచ్చరణల నడుమ లక్ష బిళ్వార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొమ్మూరు వెంకట శివప్రసాద్ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కల్లూరు వెంకటరమణమూర్తి, పోలేపల్లి కామశాస్త్రి, గాడేపల్లి రామకృష్ణ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా పునీత ఫ్రాన్సిస్ శౌరీ వేడుకలు



ఓలేరు(భట్టిప్రోలు):ఓలేరు గ్రామంలోని పునీత ఫ్రాన్సిస్ శౌరీ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివ్య పూజ బలి కార్యక్రమానికి గుంటూరు మేత్రాసనం వికార్ జనరల్ ఫాదర్ ఎస్‌సీజే రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శౌరీ ఆలయంలో విచారణ గురువు సేవి పుదుచ్చెరి, సహాయక గురువు బెన్నీ కారుకుళం, వివిధ విచారణల నుంచి వచ్చిన గురువులు పర్యవేక్షణలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ఏటా క్రమం తప్పకుండా శౌరీ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. సంఘ పెద్దలు గుంటూరు డానియేల్, నీలా రవికుమార్, వంజా రవికుమార్, నీలా జోజిబాబు, చేబ్రోలు రవి, గద్దె రమేష్ పర్యవేక్షించారు. ఇక్కడ నుంచి తరలి వెళ్లిన క్రైస్తవులు పండగలో పాల్గొన్నారు.

4న సామూహిక వ్రతాలు

భట్టిప్రోలు: స్థానిక సాయిబాబా మందిరంలో ప్రతిష్ఠించబడిన దత్తాత్రేయ స్వామి సన్నిధిలో జనవరి 4న అనఘాష్టమి పురస్కరించుకుని సామూహిక దత్తాత్రేయ, అనఘాదేవి వ్రతాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా పేర్లు నమోదైన 54 మంది భక్తులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నమోదుకు 98491 60900, 98499 62078 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవులు

భట్టిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాలు మండలంలోని అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించడం జరిగిందని మండల విద్యాశాఖాధికారి పులి లాజర్, నీలం దేవరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశానుసారం ఎటువంటి ఆస్తి నష్టం జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

అంజుమన్ కమిటీ సేవలు అభినందనీయం



బాపట్ల అర్బన్: పేదలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంజుమన్ కమిటీ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని డీఎస్పీ వెంకటేశులు అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు వేదాంత హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యద్రక్రమంలో వైద్యులు డాక్టరు చింతా రామకృష్ణ, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్.జిలానీ, వేదాంత హాస్పిటల్ వైద్యులు తిరుమల నరేష్, మంజుల శ్రీరామ్, శ్రీనివాస్ పోలిశెట్టి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటే.. సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రేపల్లె: సమాజానికి భావిభారత పౌరులను అందించే ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉండాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత గురువుదే ఉన్నత స్థానం అని అన్నారు. అటువంటి గురువుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు హరిప్రియ, కార్యదర్శి ఎంవీ బి. సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కౌన్సిలర్లు వెంకయ్య, సీహెచ్ బాపయ్య, రేపల్లె మండల గౌరవాధ్యక్షుడు వైసీఎస్ కృపారావు, అధ్యక్షుడు, చాటగడ్డ రాజ భూషణం పాల్గొన్నారు.

నిబద్ధతతో ఓటరు జాబితా సవరణ



తహసీల్దారుతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొల్లూరు: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలకు చోటివ్వకుండా నిబద్ధతతో వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, నాయకులు అధికారులను కోరారు. ఆదివారం పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో స్థానికేతరుల ఓట్లు అధికంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై విచారణ నిర్వహించి తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పలు గ్రామాలకు చెందిన ఓటర్లు తెలంగాణలో నివాసం ఉంటూ, అక్కడ ఓటు హక్కును కలిగి ఉండటంతో పాటు, ఇక్కడ కూడా ఓటు కలిగి ఉన్నారని అటువంటి ఓట్లను తొలగించాలన్నారు. మండలంలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు.

• తుపానుకు నష్టపోకుండా



కోతకొచ్చిన వచ్చిన వరి పైరు

మిచాంగ్ తుఫాన్ ప్రభావంపై ముందస్తుగా వాతావరణ శాఖ హెచ్చరించడంతో.. రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. కోసిన వరి పంటను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ముదురు పైర్లు కోతకోసి కుప్పలు వేశారు. రహదారుల్లో ఆరబోసిన పంటను..పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

– భట్టిప్రోలు

వరి ధాన్యాన్ని భద్రపరుచుకోవాలి

రేపల్లె రూరల్: ఇప్పటికే కోత కోసిన వరి పంటను రైతులు భద్రపరుచకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వాగోలు బుష్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం ఆయన పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, మోళ్లగుంట గ్రామాల్లో పర్యటించి, రైతులను అప్రమత్తం చేశారు. తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఎక్కువ శాతం యంత్రాలతో వరి కోత కోస్తున్నారని, ఈ ధాన్యం ప్రస్తుతం బస్తాల్లో నిల్వ ఉంచి, తుఫాను అనంతరం ఆరబెట్టుకోవాలని సూచించారు. ఇప్పటికే వేసిన ఓదెలను టార్పాలిన్ పట్టలు కప్పుకుని, కాపాడుకోవాలని సూచించారు. కోతలు కోయని పంట భూమిలో గండ్లు కొట్టాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రేపల్లె రూరల్: పట్టణంలోని మార్కెట్ సెంటరులో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలపాటి రామకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులకు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అయ్యప్ప భజనలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, భవానీ, శివస్వామి మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొల్లూరు : మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో భాగంగా ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సంబంధిత నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు వి. మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. స్వరాల సంగమం పేరుతో నిర్వహించిన విభావరిలో పలు చిత్రాల్లోని పాటల్ని గాయకులు యస్. సాంబశివరావు, సీహెచ్. రవికాంత్, డి.టి. సాయిబాబా, పత్రి గాయత్రీదేవి, అత్తోట సౌజన్య, జరీనా ఆలపించారు. పి. కృష్ణారావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కె. శివ ప్రసాదరావు పర్యవేక్షించారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్ట్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న ఓ మహిళను అందిన సమాచారం మేరకు ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ వినోద్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో ఓ మహిళ మద్యం అమ్ముతోందని ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ ధనుష్ ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామని, ఆమె వద్ద 40 క్వార్టర్ బాటిళ్లు లభించాయని, ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

నగరపాలక సంస్థ స్పందన రద్దు

నెహ్రూనగర్: మిచాంగ్ తుపాను కారణంగా సోమవారం నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో స్పందన రద్దు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

గుంటూరు రూరల్: బాలిక ఆత్మహత్యపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరిపాలెం ఫ్లాట్లుకు చెందిన మల్లెల అక్షయ(14) ఓబులునాయుడుపాలెం పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో స్థానికంగా తాపీ పని చేసే నవీన్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

వైకల్యం విజయానికి ఆటంకం కాదు..



దివ్యాంగులకు దుప్పట్లు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్



దివ్యాంగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

పిట్టలవానిపాలెం: దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉండాలని అల్లూరు బుడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకుడు ఫజుల్ రెహమాన్ తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరం నుంచి ప్రతిఏడాది దివ్యాంగుల దినోత్సవాన్ని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు, అనాధలు, నిరుపేదల పట్ల జాలి చూపడమే కాకుండా చేతనైన సహాయాన్ని అందించాలన్నారు. 150 మందికి అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ షేక్ బాజి, అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, అల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వాలా శివారెడ్డి, సొసైటీ సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సన్మానం

భట్టిప్రోలు: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వేమూరు నియోజకవర్గంలోని పలువురు దివ్యాంగులను ఆలిండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం (ఏఎస్‌సీఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు యన్నం సురేష్ మాట్లాడుతూ వైకల్యం విజయానికి ఆటంకం కాదన్నారు. సాధించాలనే తపన ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంభం సురేష్, లుక్కా గోపి గౌడ్, కనపర్తి సుమంత్, యన్నం కార్తిక్, కూచిపూడి సురేష్, జగదీష్, బి.రాజు, ఎం.రాంబాబు, తాడికొండ సుబ్రహ్మణ్యం, నాగరాజు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించాలి..

రేపల్లె: వైకల్యమనేది శరీరానికేగాని మనసుకు కాదని, వైకల్యాన్ని జయించి ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూలు ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వైకల్యం మరచి తమ మానసిక శక్తితో అనేక మంది కీర్తి శిఖరాలను అధిరోహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు బస్సు, రైల్వే పాస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, అరుణశ్రీ దివ్యాంగులు సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు మేకా ఉమామహేశ్వరరావు, సభ్యులు గౌతమబుద్ధా, సుభానీ, సాంబశివరావు పాల్గొన్నారు.

సిద్ధపాటు ప్రార్థన కూడికను విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం: బాపట్ల ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో ఈనెల 17వ తేదీన కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రాండ్ క్రిస్మస్ ఉత్సవంలో భాగంగా సిద్ధపాటు ప్రార్థనా కూడికను సోమవారం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు మండే విజయ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో గల ప్రార్థనా మందిరాలలో దైవసేవకులు, సంఘ పెద్దలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీన జరగనున్న గ్రాండ్ క్రిస్మస్ కార్యక్రమానికి డాక్టర్ పాలు దినకరన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు. సిద్ధపాటు ప్రార్థనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్యామల నాగిరెడ్డి, చేబ్రోలు వీరయ్య, బడుగు ప్రకాశరావు, కుంతం ప్రసన్నరాజు, బోరుగడ్డ ఆదాం, గుమ్మడి సీతయ్య ఉన్నారు.

నగరపాలక సంస్థలో కంట్రోల్ రూం ఏర్పాటు

నెహ్రూనగర్: మిచౌంగ్ తుపాను దృష్టిలో పెట్టుకొని గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూం 0863–2345103కి కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగితే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌కి ఆదేశాలు జారీ చేశారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ప్రాముఖ్యత కలిగిన కార్తిక వన మహోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



అన్నసంతర్పణ చేస్తున్న రాధాకృష్ణమూర్తి



కోటిపల్లి ఆలయంలో వన సమారాధన

బాపట్ల: కార్తిక వన మహోత్సవాన్నికి ఎంతో ప్రాముఖ్యత ఉందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకర విద్యాలయం నందు కార్తీక వన సమారాధన శ్రీ భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. గో పూజ, రుద్రాభిషేకం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. వన మహోత్సవం, కార్తిక మాసం విశిష్టతను వివరించారు. బ్రాహ్మణ సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు విభాన పూడి శ్రీహరి ప్రకాష్, కార్యదర్శి ఆలూరి నాగరాజు, కోశాధికారి సోమరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి.శ్రీకాంత్, కొలను మోహన్, బొడ్డుపల్లి నారాయణ, గన్నేపూడి వెంకటేశ్వరరావు, చిన్నాప్రగడ హరినాథ్ శర్మ, చలపతిరావు, పులిగడ్డ రామారావు, బందా బాబు, బాబు నాగేంద్ర పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం గావించారు. అనంతరం ఆలయ ఆవరణంలో వైఎస్సార్ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్న సంతర్పణ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వన సమారాధన

కొల్లూరు : కార్తిక మాసం సదర్భంగా వన సమారాధన మహోత్సవం మండలంలోని కోటిపల్లి సోమశేఖారాలయంలో వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు వనభోజనం ఏర్పాటు చేశారు.

17న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కల్యాణ్ మాట్లాడుతూ సబ్ జూనియర్స్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వెస్ట్రన్, క్లాసికల్, ఫోక్ డాన్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 17న ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 9వ తేదీలోపు పేర్లను 8897508897 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి పి. అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వై. దుర్గారామ్, ఉపాధ్యక్షులు జె. చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు ఆదివారం రూ.1,00,116 అందించారు. తాడేపల్లికి చెందిన మడితాటి శ్రీధర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందించినట్లు కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి తెలిపారు. దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషిచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సంఘ కోర్ కమిటీ సమావేశంలో ప్రతినిధి వై. శ్రీహరి పూర్ణప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న నారీశక్తి సమ్మేళనాన్ని మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.బాల చంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి. వీరబ్రహ్మం, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కార భారతి అధ్యక్షుడు ఇంద్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని భరత మాత పూజా దినోత్సవాలలో భాగంగా మూడో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేశారు. వందేమాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతిరాత, ఇంద్రజాలం, దేశభక్తి బృంద గీతాల పోటీల్ని నిర్వహించారు. పిల్లల్లో దేశభక్తిని పెంచే పోటీల్ని ఏటా నిర్వహిస్తున్న సంస్థ కార్యవర్గాన్ని మస్తానయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన కాకాని శివాలయం



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

పెదకాకాని: కార్తిక దీపాల కాంతులతో పెదకాకాని శివాలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మూడో ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ప్రాకార మండపాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయం చుట్టుపక్కల ఎటు చూసినా దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులే కనిపించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తిక దీపాలు వెలిగించి, పూజలు చేసుకునే విధంగా టేబుళ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. యజ్ఞాల బావి నీటితో పవిత్ర స్నానాలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. పొంగలి నైవేద్యాలతో, ప్రభలతో ఆలయం చుట్టూ హరోం హర అంటూ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో దాతలు ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాశనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ. 7 లక్షల ఆదాయం, అన్నదానానికి రూ. 10.50 లక్షలు విరాళాలు సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలీసు, పంచాయతీ, అగ్నిమాపక, వైద్యశాఖ అధికారులు ప్రత్యేక సహకారం అందించారు.